## క్లుప్తంగా

### కేజీహెచ్‌లో రోగులకు అందిస్తున్న భోజనంపై ఆరా



రోగుల సహాయకులతో మాట్లాడుతున్న కేజీహెచ్ పరిపాలనాధికారి బీవీ రమణ

**డాబాగార్డెన్స్:** వైద్య సేవల కోసం కేజీహెచ్‌కు వచ్చే రోగులకు పౌష్టికాహారంతో కూడిన భోజనం అందిస్తున్నామని ఆస్పత్రి పరిపాలనాధికారి బీవీ రమణ తెలిపారు. ఆస్పత్రిలోని ఎస్ – 5 వార్డు వద్ద రోగులకు అందిస్తున్న భోజనాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగుల సహాయకులతో మాట్లాడి భోజనం ఎలా ఉందని ఆరా తీశారు. గర్భిణులతో పాటు ఇతర సాధారణ రోగులకు కూడా సకాలంలో పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని డైటీషియన్ రమణమూర్తిని ఆదేశించారు. అనంతరం ఆయన భోజనం రుచి చూశారు.

### ఆర్డీవో నోటీసులు రద్దు చేయాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టు సంఘాల నేతలు

**విశాఖ సిటీ:** లీడర్ దినపత్రికకు చట్ట వ్యతిరేకంగా ఆర్డీవో శ్రీలేఖ జారీ చేసిన వారంట్ నోటీసును తక్షణమే రద్దు చేయాలని జర్నలిస్టు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, చట్ట వ్యతిరేక నోటీసులు రద్దు చేసి, ఆర్డీవోను సస్పెండ్ చేయాలంటూ నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్ హరేందిర ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. జర్నలిస్ట్ సంఘాల నేతలు సత్యనారాయణ, నానాజీ, చంద్రమోహన్, బాలు, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### సహనమే శ్రీరామరక్ష

**మురళీనగర్:** సహనమే శ్రీరామరక్ష అని.. సహనం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త డాక్టర్ గరికపాటి నరసింహారావు అన్నారు. మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులోని వేములపల్లి కళాక్షేత్రంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మనిషికి కష్టాలు కలకాలం ఉండవని, కష్టకాలంలో నిబడినవారు శాశ్వత సుఖాన్ని పొందగలరని చెప్పారు. మనిషికి ఆరాధన ఎక్కువై ఆచరణ లోపిస్తోందన్నారు. భగవన్నామస్మరణే అన్నివేళలా మానవుడిని రక్షిస్తుందన్నారు. పెద్దలు చెప్పిన మంచిని గ్రహించి అమలు చేసినవారే ధన్యులని ఆయన వివరించారు. శ్రీరాముడి లాంటి మహానుభావుడు తన జీవితంలో చూపిన సహనమే ఆయనను గొప్పవాడిని చేసిందని, ఆయనను భగవంతుడిగా మార్చిందని వివరించారు. తొందరపాటులో ఆవేశపూరిత చర్యలకు పాల్పడకూడదన్నారు. ఉత్తమ ఆలోచనలతో ఉత్తమ పురుషులుగా మారుతారన్నారు.

### పాత పెన్షన్ తక్షణమే అమలు చేయాలి

**విశాఖ విద్య:** ఉపాధ్యాయులకు పాత పెన్షన్ తక్షణమే అమలు చేయాలని యూటీఎఫ్‌రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. వేంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం గాజువాక, పెదగంట్యాడ మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. అనంతరం ఆయన డాబాగార్డెన్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సంఘం బాధ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004 సెప్టెంబర్ 1 కంటే ముందు ఉద్యోగ ప్రకటన ఇచ్చి నియామక ప్రక్రియ 2004 తర్వాత పూర్తయిన వారికి పాత పెన్షన్ ఇవ్వాలని 2017లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 57 మెమోని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2004 సెప్టెంబరు ఒకటి నుంచి పాత పెన్షన్ బదులుగా నూతన కంట్రిబ్యూషన్‌తో కూడిన నూతన పెన్షన్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. 2004 సెప్టెంబర్ కంటే ముందు ఉద్యోగం నియామక నోటిఫికేషన్ ఇచ్చి, వివిధ కారణాలతో ఆలస్యం అవటంవల్ల 2004 సెప్టెంబర్ తరువాత నియామకం పొందిన ఉద్యోగ ఉపాధ్యాయులు రాష్ట్రంలో సుమారు పదివేల మంది ఉన్నారన్నారు. వీరికి పాత పెన్షన్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ టి .అప్పారావు, జిల్లా కార్యదర్శి ఎం.డి. రిజ్వాన్, గాజువాక మండల ప్రధాన కార్యదర్శి నూకరాజు, సీనియర్ నాయకుడు చలం, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ రవిబాబు, ఎండీ అబ్దుల్ హక్ పాల్గొన్నారు.

# శివయ్య పూజలకు సిద్ధం

మహా శివరాత్రికి ముస్తాబవుతున్న శివాలయాలు

26న సాయంత్రం నుంచి అర్ధరాత్రి లింగోద్భవ కాలం వరకు రుద్రాభిషేకాలు

ప్రాచీన శివాలయాల్లో ప్రత్యేక పూజలు



సూర్యాబాగ్‌లో శతాబ్దాల చరిత్ర గల విశ్వేశ్వరాలయం

**డాబాగార్డెన్స్:**
**భక్తజన వల్లభుడు, భోళా శంకరుడిని ప్రీతిపాత్రంగా** సేవించడానికి అర్చనలు, అభిషేకాలతో ప్రసన్నుడిని చేసుకోవడానికి, ఉపవాసాలు, జాగరణలతో పార్వతీపతి అనుగ్రహం పొందడానికి అనువైన మహాశివరాత్రి కోసం సర్వసన్నద్ధమైంది. బుధవారం మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివాలయాలు పంచాక్షరీ మంత్ర ప్రతిధ్వనులతో మార్మోగనున్నాయి. బుధవారం (26న) వేకువజాము నుంచే మహాశివునికి అభిషేకాలు ప్రారంభంకానున్నాయి. ద్వాదశ జ్యోతిర్లింగాలకు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయాలన్నీ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. సాయంత్రం నుంచి అర్ధరాత్రి లింగోద్భవ కాలం వరకు ఏకాదశ రుద్రాభిషేకాలు, అర్చనలు నిర్వహించనున్నారు. పరమశివుడి దర్శనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలోని ప్రధాన శివాలయాల్లో పూజలకు భారీ ఏర్పాట్లు చేశారు. మెయిన్ రోడ్డులో గల విశ్వేశ్వరాలయంలో వేకువ జాము నుంచే పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరపనున్నారు. సింగ్ హోటల్ జంక్షన్ శివాలయం వీధిలో ఉన్న ఓంకార ఆలయంలో ప్రాతఃకాలం నుంచే ఓంకారేశ్వర స్వామికి అభిషేకాలు జరపనున్నారు. రాత్రి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు చేయనున్నారు. ఏవీఎన్ కాలేజ్‌లో ఉన్న శివాలయం, పోలీస్ బ్యారెక్స్‌లో గల ఉమా రామలింగేశ్వరాలయం, అస్సాం గార్డెన్స్‌లో గల శివరామకృష్ణ ఆలయం, బీచ్‌రోడ్డులో గల కోటీశ్వరాలయం, పెరికివీధిలో గల శివాలయంలో ప్రత్యేక పూజలు జరపనున్నారు.

### 400 ఏళ్ల నాటి శివాలయం

ఇప్పటి దసపల్లా హోటల్ పక్కనే ఉన్న విశ్వేశ్వరస్వామి ఆలయానికి నాలుగు శతాబ్దాల చరిత్ర ఉంది. గతంలో ఈ ప్రదేశంలో ఓ నాగసాధువు మఠం నిర్వహించేవారు. తన శిష్యురాలైన బాదంపూడి వంశీయులతో విశ్వేశ్వరస్వామి మూల విరాట్టును ప్రతిష్ఠింపజేశారు. శివ లింగానికి చేసే అభిషేక జలం తన జీవ సమాధిపై పడేలా ఏర్పాట్లు చేసుకుని స్వామిజీ సజీవ సమాధిలోకి వెళ్లిపోయారు. అందుకే ఈ దేవాలయాన్ని మఠం కోవెలగా వ్యవహరిస్తున్నారు.

- ప్రస్తుతం పాతనగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ చేరువలోని భీమేశ్వరాలయానికి కూడా ప్రాచీన చరిత్ర ఉంది. పాండవులు వనవాసం చేసే సమయంలో భీముడు శివలింగాన్ని ప్రతిష్ఠించాడన్న ఖ్యాతిని పొందిన ఆలయం. నాలుగు దశాబ్దాల క్రితం పునరుద్ధరణ కారణంగా మరింత గుర్తింపు పొందింది. లోతుగా ఉన్న గర్భగుడిని 1981లో పైకి తీసుకువచ్చి ఆలయాన్ని పునర్నిర్మించారు.

### వైశాఖేశ్వర ఆలయ నమూనాతో...


14వ శతాబ్దంలో ఈ ప్రాంతాన్ని కుళోత్తుంగ చోళుడు పరిపాలించాడు. ఆయన తమ ఇలవేల్పునకు బంగాళాఖాతంలో (కోస్టల్ బ్యాటరీ వద్ద) వైశాఖేశ్వర ఆలయాన్ని నిర్మించాడు. ఆ దైవం పేరున విశాఖకు ఈ పేరు స్థిరపడిందని ఓ వాదన ఉంది. అయితే ఈ ఆలయం కాలక్రమంలో సముద్ర గర్భంలో కలిసిపోయింది. దాని నమూనాతో ప్రస్తుతం కలెక్టరేట్ సమీపంలోని ఆఫీషియల్ కాలనీ మూడో వీధిలో నిర్మించిన ఆలయం బుచ్చిరామలింగేశ్వర ఆలయంగా ప్రసిద్ధికెక్కింది. ఆగ్నేయ ముఖంగా ఉన్న ఈ ఆలంయలో స్వామి స్ఫటిక లింగంగా భక్తులకు దర్శనమిస్తున్నారు.



పాతనగరంలో గల భీమేశ్వరాలయం

### ఉమా రామలింగేశ్వరాలయంలో వార్షికోత్సవాలు

బౌడరా రోడ్డులో గల ఉమా రామలింగేశ్వర సంచాయతన దేవాలయ 58వ వార్షిక పూజలు ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్నాయి. వార్షికోత్సవాల్లో భాగంగా 25న ఉదయం 9 గంటలకు స్వామి ఊరేగింపుతో పూజా మహోత్సవాలు ప్రారంభించనున్నారు. అనంతరం శ్రీనివాస్ అండ్ పార్టీచే నాదస్వర కచేరి, సాయంత్రం అఖండ హారతి, భక్తులచే భక్తి రంజని కార్యక్రమం నిర్వహించనున్నారు. 26న మహా శివరాత్రిని పురస్కరించుకుని ఉదయం నమక చమక పారాయణం, హోమాలు, అభిషేకాలు, రేజింగ్ సింగర్స్ గ్రూప్‌చే భక్తి రంజని, సాయంత్రం అఖండ హారతి, ఉపన్యాసాలు, అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో అష్టోత్తర సహస్ర జ్యోతిర్లింగ దర్శనం, రుద్రాభిషేకాలు జరపనున్నారు. 27న ఉదయం నమక చమక పారాయణ, భక్తి రంజని, సాయంత్రం శ్రీవారి భక్తి సంగీత విభావరి, 28న సాయంత్రం ఘంటసాల గాన సుధ, మార్చి 1న సాయంత్రం ఉమా రామలింగేశ్వరుల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు.



బుచ్చిరామలింగేశ్వరాలయం (బెల్లం గణపతి ఆలయం)

## వైభవంగా దీపాలంకరణ



దీపాలంకరణలో దుర్గాలమ్మ ఆలయం

**డాబాగార్డెన్స్:** నగరంలోని పూర్ణామార్కెట్ సమీప వెలంపేటలో వెలసిన దుర్గాలమ్మ దేవస్థానం వార్షిక జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా దుర్గాలమ్మ ఆలయాన్ని దీపాలంకరణతో తీర్చిదిద్దారు. పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. భవానీ మాలలు ధరించిన భక్తులు మొక్కులు సమర్పించుకున్నారు. ప్రత్యేక కుంకుమ పూజలు, అర్చనలతోపాటు పంచామృతాభిషేకం నిర్వహించారు. ఉత్సవాలు ఈ నెల 27 వరకు కొనసాగనున్నాయి. 25న తొలేళ్ల ఉత్సవం, 26న మహా శివరాత్రి ప్రత్యేక పూజలు, ఆ రోజు రాత్రి 12 గంటలకు అమ్మవారి నేత్రోత్సవం, తొలిపూజ అత్యంత వైభవంగా జరపనున్నారు. 27న అమ్మవారి వార్షికోత్సవ జాతర అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. వచ్చే నెల 6న మారువారం పండగ, పెద్ద ఎత్తున అన్నసమారాధన చేపట్టనున్నారు.

## కనక మహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

**డాబాగార్డెన్స్:** ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనక మహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891 – 2711725, 2566514కు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 (టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081)కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

## వసతి గృహంలో ఇద్దరు వృద్ధురాళ్లకు ఆశ్రయం



వృద్ధురాలు లక్ష్మిని వసతి గృహంలో అప్పగిస్తున్న యువకులు



వృద్ధురాలికి ఆశ్రయం కల్పిస్తున్న మేనేజర్ జ్యోతిర్మయి, కానిస్టేబుల్

**సీతమ్మధార:** ఈ వృద్ధురాలి పేరు తాటిపిల్లి లక్ష్మి(75). ఊరు తగరపువలస. ఆరిలోవ పోలీసులు పంపించారని చెప్పి.. ఇద్దరు యువకులు ఈమెను ద్వారకానగర్‌లోని ఏయూటీడీ–జీవీఎంసీ మహిళా షెల్టర్ హోమ్‌కు సోమవారం అప్పగించారు. వృద్ధురాలిని తన వివరాలు అడగ్గా.. కుటుంబ సభ్యులున్నారని చెప్పి, ఇతర ఏ విషయం స్పష్టంగా చెప్పలేకపోయారు. ఈమెకు వసతి గృహంలో తాత్కాలికంగా కొన్ని రోజులు ఆశ్రయం కల్పించినట్లు షెల్టర్ హోమ్ మేనేజర్ జ్యోతిర్మయి తెలిపారు.

- ఇంటి నుంచి వచ్చేసిన వృద్ధురాలికి ద్వారకానగర్‌లోని టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో గల జీవీఎంసీ – ఏయూటీడీ వసతి గృహంలో సోమవారం ఆశ్రయం కల్పించారు. కంచరపాలెం ప్రాంతానికి చెందిన దుక్క అన్నమ్మ (60)కు ఇద్దరు కుమార్తెలు. ఆమెను కుమార్తెలు తిడుతూ కొడుతుండడంతో ఆ బాధ భరించలేక ఇంటి నుంచి వచ్చేసింది. ఆమెను గుర్తించిన రెండో పట్టణ పోలీసులు ఏయూటీడీ మహిళా షెల్టర్ హోమ్‌కి తరలించారు. ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు సూచన మేరకు అన్నమ్మ సమస్య పరిష్కారమయ్యే వరకు ఆశ్రయం కల్పించామని వసతిగృహం మేనేజర్ జ్యోతిర్మయి తెలిపారు.

## సువార్త రాజుకు సత్కారం



సువార్త రాజును సత్కరిస్తున్న పాస్టర్ హరీష్

**డాబాగార్డెన్స్:** వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన సువార్త రాజుని 34వ వార్డులో గల వే ఆఫ్ సాల్వేషన్ చర్చ్ పాస్టర్ జి.హరీష్ ఎజ్రా, హేమ ఎజ్రా, జి.శిరీష సోమవారం ఘనంగా సత్కరించి, జ్ఞాపిక బహూకరించారు. ఈ సందర్భంగా సువార్త రాజు మాట్లాడుతూ తనకు ఈ పదవి రావడానికి పార్టీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, పార్టీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ సహకారం ఎంతో ఉందన్నారు. వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, నాయకులు లింగం శ్రీనివాస్, లండా రమణ, సత్తిరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్డుపై ఆక్రమణల తొలగింపునకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



మార్కెట్ రోడ్డులో వ్యాపారాలను క్రమబద్ధీకరిస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

**అల్లిపురం:** రహదారులను ఆక్రమించి వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది వ్యాపారులను హెచ్చరించారు. జీవీఎంసీ 32వ వార్డులో రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేస్తుండటంతో రాకపోకలకు ప్రజలు పడుతున్న ఇబ్బందులపై 'మార్కెట్ వీధి..ఒకటే రద్దీ' శీర్షికతో సాక్షిలో సోమవారం ప్రచురితమైన వార్తపై అసిస్టెంట్ సిటీ ప్లానర్ స్పందించారు. ఏసీపీ ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది అల్లిపురం మార్కెట్ ప్రాంతానికి వెళ్లి, రోడ్డును ఆక్రమించి ఉన్న వ్యాపారాలను క్రమబద్ధీకరించారు. రోడ్డు మార్జిన్ లోపే సరకులు సర్దుకుని వ్యాపారాలు చేసుకోవాలని వ్యాపారులకు సూచించారు. మరోసారి మార్జిన్ దాటి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఏపీ బోట్లకు అడ్డంకులు లేకుండా చూడాలి



ఒడిశా గవర్నర్ హరిబాబును సన్మానిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

**విశాఖ సిటీ:** ఒడిశా రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబును ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పలు అంశాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. విశాఖకు చెందిన ఫిషింగ్ బోట్లను పారాదీప్ పోర్టు అధికారులు, స్థానిక పారాదీప్ మత్స్యకార సంఘాల పెద్దలు అనుమతించడం లేదని తెలిపారు. దీనిపై అక్కడి అధికారులతో మాట్లాడి విశాఖ బోట్లకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. దీనిపై గవర్నర్ సానుకూలంగా స్పందించారు. గవర్నర్‌ను అసోసియేషన్ అధ్యక్షుడు పి.సి.అప్పారావు, ప్రతినిధులు బాలాజీ, జి.గంగయ్య, జి.రాజేష్, బి.అప్పన్న, సీహెచ్.రాజు తదితరులు కలిశారు.

## కాలుష్య నియంత్రణకు సహకరించండి



జీవీఎంసీ కార్యాలయానికి బస్సులో వచ్చిన మేయర్ హరి వెంకటకుమారి

**డాబాగార్డెన్స్:** నగరంలో కాలుష్య నియంత్రణకు అందరూ సహకరించాలని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి కోరారు. ప్రతి ఒక్కరూ వారంలో ఒకరోజు వ్యక్తిగత వాహనాలు వీడి, ప్రజా రవాణా వినియోగించాలని కోరారు. ఆమె సోమవారం తమ క్యాంపు కార్యాలయం నుంచి ప్రజా రవాణా వ్యవస్థ ఏపీఎస్ఆర్‌టీసీ బస్సులో జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. మేయర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించాలనే నిర్ణయం మేరకు జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు వాటినే ఉపయోగిస్తున్నారన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

## దుర్గంధం నుంచి విముక్తి



కుక్క మృతదేహాన్ని కార్మికుడితో తీయిస్తున్న పచ్చిరిపల్లి రాము

**అల్లిపురం:** నారాయణ స్ట్రీట్‌లో ఓ కుక్క మృతి చెందడంతో స్థానికులు రెండు రోజులుగా దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పచ్చిరిపల్లి రాముకు తెలియజేయడంతో ఆయన స్పందించారు. వెంటనే మనుషులను పిలిపించి, కుక్క మృతదేహాన్ని అక్కడి నుంచి తీయించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## సిగ్నల్స్ ఉన్నా.. ట్రాఫిక్ నియంత్రణ శూన్యం

రెడ్‌సిగ్నల్ పడినా ఆగని వాహనచోదకులు



ద్వారకానగర్ సిగ్నల్స్ వద్ద గందరగోళంగా వాహనాల రాకపోకలు



ట్రాఫిక్ సిగ్నల్స్‌కి విరుద్ధంగా వాహనాల రాకపోకలు

**సీతమ్మధార:** నగరంలో నిత్యం రద్దీగా ఉండే ఆశీలమెట్ట, ఆర్టీసీ కాంప్లెక్స్, సంగమ్ శరత్ జంక్షన్ల వద్ద ట్రాఫిక్ గందరగోళంగా ఉంటోందని నగరవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ట్రాఫిక్ కానిస్టేబుళ్లు లేని సమయంలో సిగ్నల్స్ బాగానే పనిచేస్తున్నా... చాలా మంది వాహన చోదకులు రెడ్‌సిగ్నల్ ఉన్నప్పటికీ రయ్ రయ్‌మని దూసుకుపోతున్నారు. దీంతో గ్రీన్‌సిగ్నల్ మార్గంలో వెళ్లే వాహనచోదకులు, పాదచారులు హడలిపోతున్నారు. ద్వారకా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆర్టీసీ కాంప్లెక్స్, గురజాడ అప్పారావు జంక్షన్, సంగమ్ – శరత్ జంక్షన్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ట్రాఫిక్ గందరగోళంగా ఉంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఈ మార్గంలో 69, 411, 211, 28వ నంబరు సిటీ బస్సులతోపాటు అరకు, ఎస్.కోట, నర్సీపట్నం, అనకాపల్లి నుంచి వచ్చే బస్సులు, మెట్రో సర్వీసులు రాకపోకలు సాగిస్తాయి. ఈ నేపథ్యంలో ఆటోలు, కార్లు, ద్విచక్రవాహనాలు రాత్రిపూట సిగ్నల్స్‌కి విరుద్ధంగా రాకపోకలు సాగిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. మరోవైపు సందట్లో సడేమియా అన్నట్టుగా ఆటోవాలాలు రోడ్డు మలుపు తిరిగే ప్రాంతంలో దర్జాగా పార్కింగ్ చేసి మరీ ప్రయాణికుల కోసం నిరీక్షిస్తుండడం గమనార్హం. దీంతో వెనుకగా వచ్చే వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఫలితంగా ఈ ప్రాంతమంతా వాహనాల హారన్లమోతతో శబ్ద కాలుష్యం పెరిగిపోతోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ద్వారకా ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులు స్పందించి ట్రాఫిక్‌ని గాడిలో పెట్టేలా చర్యలు చేపట్టాలని పాదచారులు, వాహనచోదకులు కోరుతున్నారు.

## జాలరిపేటలో దివ్యాంగ పిల్లల గుర్తింపు సర్వే

**ఎంవీపీకాలనీ:** జీవీఎంసీ 19వ వార్డు జాలరిపేటలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జిల్లా ఆధ్వర్యంలో సోమవారం దివ్యాంగ పిల్లలను గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 10 నుంచి 24 వరకు ఇంటింటికీ వెళ్లి దివ్యాంగుల గుర్తింపు సర్వే చేపట్టినట్లు సంస్థ జిల్లా కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ తెలిపారు. చినవాల్తేర్‌లోనూ సోమవారం ఈ సర్వే జరిగిందన్నారు.

## మూడు పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న ఎంవీఎస్ శర్మ, పద్మజా షా, తదితరులు

**సీతంపేట :** మార్క్సిస్టు అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మూడు పుస్తకాల ఆవిష్కరణ సభ సోమవారం నిర్వహించారు. కన్నడ మూలం నుంచి ఆచార్య జి.రామకృష్ణ రాసిన 'రుగ్వేద యదార్థ దర్శనం పుస్తకాన్ని ఎంవీఎస్ శర్మ ఆవిష్కరించగా, కొబడ్ గాంధీ రాసిన 'బీటలు వారిన స్వేచ్ఛ' పుస్తకాన్ని, వివినమూర్తి రాసిన 'వాడు నేను' నవలను పద్మజా షా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆచార్య రామకృష్ణ మాట్లాడుతూ ప్రపంచ మౌఖిక సాహిత్యంలో రుగ్వేదానికి విశిష్ట స్థానం ఉందన్నారు. కాలక్రమేణా రుగ్వేదాన్ని ఒక మత గ్రంథంగా చూస్తే నాటి సమకాలీన సమాజం, దాని సంక్లిష్టత, బహుముఖ రూపాలు, వాటి మధ్య ఉండే సంబంధాలను అర్థం చేసుకోవడం సాధ్యం కాదన్నారు. బహుముఖ కోణాల నుంచి విశ్లేషణ చేయాలని, ప్రాచీన సంకలనానికి నమూనాగా నిలిచిన రుగ్వేద యదార్థ దర్శనం పుస్తకం చదవాలని కోరారు. పద్మజా షా మాట్లాడుతూ కూడు, గూడు, నీడ మనిషి స్వేచ్ఛకు సంబంధించిన మూడు త్రిముఖ పార్శ్వాలని, అవి మనిషి మనుగడకు ఎంతో ముఖ్యమైనవని తెలిపారు. దశాబ్ద కాలం పాటు జైలుపాలై నిరపరాధిగా బయటపడిన సామజిక మేధో జీవి కోబడ్ గాంధీ రాజకీయ జ్ఞాపకాల దొంతరే బీటలు వారిన స్వేచ్ఛ పుస్తకమని తెలిపారు. రచయిత వివినమూర్తి మాట్లాడుతూ గత 60 ఏళ్ల నుంచి భారత దేశంలో సాగుతున్న వివిధ పరిణామాలను ఈ పుస్తకంలో ఆవిష్కరించడం జరిగిందన్నారు. మార్క్సిస్టు అధ్యయన కేంద్రం నిర్వాహకులు జె.వి.సత్యనారాయణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో విశ్రాంత ఆచార్యుడు వృద్ధుల కల్యాణ రామారావు, కె.ఎస్.మల్లీశ్వరి, కె.మురళి పాల్గొని పుస్తక సమీక్ష చేశారు.

## మాతృ మరణాలు సంభవిస్తే చర్యలు

**మద్దిలపాలెం:** మాతా, శిశు మరణాలు సంభవిస్తే చర్యలు తప్పవని, వాటి నివారణకు క్షేత్రస్థాయిలో గర్భిణులను గుర్తించి తగు సూచనలివ్వాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు ఆదేశించారు. రేవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి పద్మనాభం మండలం రెడ్డిపల్లిలో జనవరిలో సంభవించిన ఒక మాతృ మరణంపై సోమవారం ఆయన డీఎంహెచ్‌వో కార్యాలయంలో మాతా, శిశు సంక్షేమ కమిటీతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెడ్డిపల్లిలో ఒక మాతృ మరణం జనవరిలో జరిగిందని, ఇకపై అవి జరగకూడదని హెచ్చరించారు. గర్భిణీగా ఉన్నప్పుడే హై రిస్క్ ప్రెగ్నన్సీని గుర్తించి తగిన వైద్య సలహాలు అందించాలని కేజీహెచ్, వీజీహెచ్‌లో గల గైనకాలజిస్టులకు సూచించారు. గర్భిణికి సాధారణ ప్రసవం అయ్యేటట్లు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.

## సామాజిక చైతన్యం పెంపొందించాలి

**సీతంపేట :** సామాజిక చైతన్యాన్ని పెంపొందించే విధంగా ఇస్కఫ్ కార్యక్రమాలు రూపొందించుకోవాలని నాగార్జున యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్ సూచించారు. భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) సర్వసభ్య సమావేశం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ యువతలో సామాజిక చైతన్యం తీసుకురావాలని, కళలు అంతరించిపోకుండా భావితరాలకు అందించేలా ఇస్కఫ్ భవిష్యత్ కార్యక్రమాలు రూపొందించాలని సూచించారు. అనంతరం ఇస్కఫ్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కొత్త కార్యవర్గాన్ని బాలమోహన్‌దాస్ అభినందించారు. ఇస్కఫ్ జిల్లా అధ్యక్షుడిగా కె.సురేష్ కుమార్, క్షేత్రపాల్ రెడ్డి, మధుమతి, ఇమంది పైడిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా దేవరకొండ మార్కండేయులు, కార్యదర్శిగా కె.సత్యాంజనేయ, కోశాధికారిగా జి.సూర్యకుమారి, ఎం.ఎ.బేగం, సత్యవతి, ఉపాధ్యక్షులుగా జె.రాంప్రభు, సీహెచ్. మధుబాబు, రాజకుమారి, అప్పన్న, కె.విజయమణి, మనుపల్లా, వి.జహరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షులు సుకుమారన్, ఎస్. నర్సింహులు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఉప్పల అప్పలరాజు, వి.వెంకటరావు, ఐ.ఎం.మహ్మద్, ఝాన్సీ మాధవి పాల్గొన్నారు.